విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 01, జూన్ 2025

విద్యుదాఘాతంతో గేదె మృతి

విశాలాంధ్ర - రుద్రవరం: మండలంలోని చిన్న కంబలూరు గ్రామానికి చెందిన శీను అనే పాడి రైతుకు చెందిన గేదె విద్యుత్ తీగ తగిలి మృతి చెందిన సంఘటన గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన శీను అనే వ్యక్తి తనకు చెందిన గేదెలను మేపుకొని జీవనం సాగిస్తున్నాడన్నారు. శనివారం గేదెలను మేపుకునేందుకు బయలుదేరి చిన్న కంబలూరు మెట్ట సమీపంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫామ్ వద్ద అప్పటికే తెగిపడి కింద పడ్డ విద్యుత్ తీగను గేదె తగిలి అక్కడికక్కడే మృతి చెందడం జరిగిందన్నారు. విషయం తెలుసుకున్న పశువైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్ ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. గేదెలనే నమ్ముకుని, మేపుకుంటూ జీవనం సాగించుకుంటున్న శీనుకు గేదె మృతి చెందడంతో దాదాపు రూ.90 వేల నష్టం వాటిల్లి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. ప్రభుత్వం గుర్తించి బాధితునికి ఆర్థిక సహాయం అందించాలని గ్రామస్తులు కోరారు.

ఓ రోజు ముందుగానే పింఛన్ : మంత్రి బీసీ

విశాలాంధ్ర - బనగానపల్లె: ఒకేసారి మూడు నెలల పింఛన్ నగదు తీసుకునే వెసులుబాటు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు దక్కిందని రోడ్లు భవనాలు శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. బనగానపల్లె మండలం పలుకూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం ఉదయం స్వయంగా పెన్షన్ లబ్ధిదారుల ఇంటికి వెళ్లి, వారి యోగ - క్షేమాలు అడిగి ఇంటి వద్ద నే పింఛన్లు అందజేశారు. అనంతరం మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల శ్రేయస్సు సంక్షేమం కాంక్షించే ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో ప్రతి నెలా దాదాపుగా 64 లక్షల మంది లబ్ధిదారులకు పెన్షన్లు అందిస్తున్నామన్నారు. మాజీ ఎంపీపీ అంబాల రామకృష్ణారెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, చల్లా మద్దిలేటి, శంకర్ చల్ల చిన్నయ్య అధికారులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి చేయాలంటే చంద్రబాబుకే సాధ్యం

విశాలాంధ్ర - ప్యాపిలి: రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించాలంటే ఒక చంద్రబాబుకే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోనిఏనుగుమర్రి గ్రామంలో వేణుగోపాల స్వామి ఆలయ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట ప్రకారం పేదలకు పింఛన్లు పెంచి వారికి పంపిణీ చేస్తున్నామని అంతే కాకుండా సిక్స్ పథకాలను త్వరలో అమలు చేస్తామని ఇందులో భాగంగా జూన్ నెలలో తల్లికి వందనం, అమలు చేస్తామని ఆయన అన్నారు. గ్రామాలలో ప్రజలందరూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన అన్నారు. అనంతరం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్, ఎద్దులదొడ్డి ప్రభాకర్ రెడ్డి, ఖాజాపీర, రామకృష్ణ, అరిగెల శంకర్, గొల్ల రామ్మోహన్, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలకై జరిగే ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఈ నెల 2న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి జి.హరినాథ్, మండల సహాయ కార్యదర్శి ఎస్ జిలాని భాష, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి.లక్ష్మీదేవి, గోస్పాడు గ్రామశాఖ సహాయ కార్యదర్శి ఎస్.మౌలాలు పిలుపునిచ్చారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ గోస్పాడు మండలం సిపిఐ కార్యాలయంలో గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా హరినాథ్ మాట్లాడుతూ గోస్పాడు మండలంలో అర్జీదారులతో మండల తహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వ హిస్తున్నట్లు వారు తెలిపారు. సిపిఐ నాయకులు పావన్న, ముల్లా హుస్సేన్, అలీ భాషా, పోతులూరయ్య, అంకన్న పాల్గొన్నారు.

ముగిసిన యోగాంధ్ర శిక్షణ

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ: మండల కేంద్రమైన ఉయ్యాలవాడలోని ఏపీ మోడల్ స్కూల్ లో గత ఐదు రోజులుగా జరుగుతున్న యోగాంధ్ర శిక్షణ తరగతులు. శనివారంతో ముగిశాయి. ఎంపీడీవో ఉమా మహేశ్వర రావు తహశీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆయా సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు వీరు గ్రామాలలో కెళ్ళి అక్కడ ప్రజలకు శిక్షణ ఇస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఓపిఆర్డి వెంకటేశ్వరరావు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -డోన్ : జూన్ 2తేదీన తహశీల్దార్ కార్యాలయాల ముందు ఇంటిస్థలాలు కోసం జరిగే ధర్నాను జయప్రదం చేయాలనిసీపీఐ జిల్లాకార్యదర్శి ఎన్.రంగ నాయుడు అన్నారు. శనివారం డోన్ మండల పరిధిలోని సీసంగుంతల శాఖ మహసభలు సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి మనోహర్ అద్యక్షతన జరిగింది. ముందుగా శాఖ మహాసభల సందర్భంగా జెండాను సీపీఐ సీనియర్ నాయకులు జి.యల్లయ్య ఆవిష్కరించారు. శాఖమహాసభలకు ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సుంకయ్య హజరయ్యారు. ఎన్.రంగ నాయుడు మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి ఇంటి పట్టాలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. రేపు రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాలవద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల మేనిఫెస్టోలో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, నగర ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇంటి పట్టాలు ఇస్తూ ఇంటి నిర్మాణానికి రూ. 4 లక్షలు ఇస్తామని చెప్పడం జరిగిందన్నారు. ఇసుక, ఇనుము, సిమెంటు ధరలు పెరగడం వలన ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని సీపీఐ డిమాండ్ చేస్తుందన్నారు. గ్రామ సచివాలయాల వద్ద, తహశీల్దార్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద దశలవారీగా ఉద్యమం నడపడం జరిగిందన్నారు. తక్షణమే ఇంటి స్థలాల దరఖాస్తులు చేసుకున్న వారికి సర్వే చేయాలని అర్హుల జాబితాను ప్రకటించాలన్నారు. మండల కార్యదర్శి, బి.నారాయణ, మండల సహాయ కార్యదర్శి, హుస్సేన్ పీరా, మండల కార్యవర్గ సభ్యుడు జి.రామకృష్ణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రణత్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సూర్య ప్రతాప్, చేతి వృత్తిదారుల జిల్లా కార్యదర్శి రామ్మోహన్, అఖిల భారత యువజన సమాఖ్య మండల కార్యదర్శి పృథ్వి కుమార్, పెద్ద రాముడు, శివ పెద్దయ్య దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సీసం గుంతల శాఖనూతన కమిటి : సీపీఐ సీసం గుంతల శాఖ కార్యదర్శి కె.మనోహర్, శాఖ సహాయకార్యదర్శు జి.హరికృష్ణతోపాటు 15 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

సిద్దేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమకు వెలుగు

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : సిద్దేశ్వరం అలుగు నిర్మాణంతోనే రాయలసీమకు వెలుగని, సిద్దేశ్వరం అలుగు నిర్మించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్య ధోరణిని అవలంబి స్తున్నాయని, సిద్దేశ్వరం అలుగు నిర్మించేంత వరకు పోరాటం ఆగదని నంద్యాల డీసీసీ అధ్యక్షులు, ఏఐసిసి మెంబర్ లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన ప్రజా ఉద్యమంగా 2016 మే 31న తేదీన జరిగిందని, ఈ శంకుస్థాపనలో ఆరోజు నేను కూడా ఉద్యమంలో పాల్గొన్నానని, తొమ్మిదేళ్లగా ప్రజా ఉద్యమం కొనసాగుతు ందని, సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై పాలక ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి స్పష్టంగా అర్థం అవుతుందనీ, కృష్ణా నదిపై సిద్దేశ్వరం సమీపంలో శ్రీశైలం జలాశయానికి 860 అడుగుల ఎత్తులో అలుగు నిర్మిస్తే పోతిరెడ్డిపాడు నుంచి రాయలసీమ ప్రాజెక్టులకు నీరు అందుతుందన్నారు. సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని లక్ష్మీ నరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పఠాన్ అబూఖాన్, మైనార్టీ జిల్లా అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షులు బాలస్వామి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రజాక్ వలి, చెన్నయ్య, విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పని చేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో ఉంచాలని ఛైర్ పర్సన్ మాబున్నిసా అన్నారు. శనివారం నంద్యాల కౌన్సిల్ సమావేశం ఛైర్పర్సన్ మాబున్నీసా అధ్యక్షతన ఇంచార్జ్ కమిషనర్ వెంకట దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 16 అంశాలతో కూడిన అజెండాను ఆమోదించారు. పట్టణంలోని పలు వార్డుల్లో కాంట్రాక్టర్లు పనులు చేయడం లేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేస్తూ సభ దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై ఛైర్ పర్సన్ మాబున్నిసా మాట్లాడుతూ కాంట్రాక్టర్లు డిపాజిట్ గా కట్టిన ఒక్క శాతం డబ్బులను నిలుపుదల చేయాలని ఇంచార్జ్ కమిషనర్ వెంకటదాస్‌కు సూచించారు. డంపు యార్డులో పొగ పెడుతున్నారని దాని వల్ల పివి నగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని ఒకటవ వార్డు కౌన్సిలర్ పి. నాగార్జున ఆవేదన వ్యక్తం చేశారు. డంప్ యార్డు విషయంలో అధికారులు జాగ్రత్తగా ఉండాలని ఛైర్ పర్సన్ మాబున్నిసా అధికారులను ఆదేశించారు. మా వార్డులో ఒక్క పని కూడా జరగలేదని 12 వార్డు కౌన్సిలర్ ఖండే శ్యాం సుందర్ లాల్ సభ దృష్టికి తీసుకొచ్చారు. గత మూడేళ్లుగా మా వార్డులో ఎన్ని పనులు కేటాయించారో పూర్తిగా పేపర్ మూలంగా సమాచారం కావాలని కోరారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు ఛైర్ పర్సన్ మాబున్నిసాను కోరారు. ఈ విషయాన్ని శానిటేషన్ సూపరైజర్ మురళీధర్ ను అడుగగా బ్లీచింగ్ పౌడర్ అయిపోయిందని, త్వరలో తెప్పించి చల్లుతారని తెలపగా ఛైర్ పర్సన్ మాబున్నిసా శానిటేషన్ విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పలువురు కౌన్సిలర్లు సభ దృష్టికి తీసుకొచ్చారు. శానిటేషన్ సూపరైజర్ మురళీధర్ మాట్లాడుతూ గతంలో ఒప్పందం కుదుర్చుకున్న కాంట్రాక్టర్లు రద్దు చేసుకున్నారని, ఇప్పుడు కొత్తగా నవదోయ వెట్ సొసైటీ, హైదరాబాద్ వారు ముందుకు వచ్చారని, పట్టణంలో 1618 కుక్కలున్నాయని, ఒక్కో కుక్కకు 1650 ఖర్చు అవుతుందని, మొత్తం కుక్కలకు కు.ని. ఆపరేషన్‌లకు 26,69,700 ఖర్చవుతుందని, త్వరలో కుక్కలను కట్టడి చేస్తామన్నారు. పన్నులు ఇష్టానుసారంగా వేస్తున్నారని, పలువురు కౌన్సిలర్లు ఛైర్ పర్సన్ మాబున్నిసా దృష్టికి తెచ్చారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ కమిషనర్ వెంకటదాస్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు సలాముల్లా, డీఈలు, టౌన్ ప్లానింగ్ అధికారి నరసింహ మూర్తి, ఆర్ఓ వెంకటరెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జరిగే ధర్నాకు రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రాక

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: పట్టణంలో ఇల్లులేని నిరుపేదలతో కలిసి జూన్ 2వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ హాజరవుతున్నట్లు నంద్యాల పట్టణ సీపీఐ కార్యదర్శి కె.ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు పట్టణంలోని వివిధ ప్రాంతాలలో ఇల్లులేని నిరు పేదలతో సమావేశం ఏర్పాటు చేశారు. సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్ నందమూరి నగర్ అర్జిదారుల తోను, సిపిఐ సీనియర్ నాయకులు సలాం ఖాన్ వినికాలనీ అర్జీదారులతో, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి విశ్వనగర్ అర్జీదారులతో, సిపిఐ గోస్పాడు మండల కార్యదర్శి హరినాథ్ వివేకానంద కాలనీ అర్జీదారులతో, మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ బాలాజీ కాంప్లెక్స్ అర్జీ దారులతో సమావేశాలు ఏర్పాటు చేసి కార్యక్రమం వివరాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇంటి స్థలాలు ఇవ్వాలని దశల వారి ఆందోళనలో భాగంగా రేపు నంద్యాలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ రానున్నారని తెలిపారు. అర్జీదారులు అందరూ జూన్ రెండవ తారీకు ఉదయం 10 గంటలకు టెక్కే మార్కెట్ యార్డ్ దగ్గరికి రావాలని అక్కడనుండి ర్యాలీగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఇంటి స్థలాలకు అర్జీలు పెట్టిన వారి తరపున అధికారులతో మాట్లాడడం జరుగుతుందని ఆయన తెలిపారు.

కరాటేతో ఆత్మరక్షణ : మాజీ సర్పంచ్

విశాలాంధ్ర - బనగానపల్లె: విద్యార్థులు కరాటే నేర్చుకోవడం వల్ల ఆత్మరక్షణతో పాటు శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుందని బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి రాజారెడ్డి అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియం నందు జెన్ స్పోర్ట్స్ - ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో కరాటే సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమం శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బిసి రాజారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే పిల్లలు క్రీడల్లో చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. క్రీడల వల్ల పిల్లలు ఒత్తిడిని జయించడంతోపాటు మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతాయన్నారు. పిల్లలపై తల్లిదండ్రుల అభిప్రాయాలను రుద్దకుండా వారి అభిరుచులకు అనుగుణంగా ప్రోత్సహించాలని సూచించారు. నెహ్రూ హైస్కూల్ నందు క్రీడలతో పాటు సాహితి, సాంస్కృతి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుండటం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షుడు కోలా ప్రతాప్, నెహ్రూ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ డైరెక్టర్ కోడూరు రవితేజారెడ్డి, ఉపాధ్యాయులు రామ్మోహన్ రెడ్డి, అన్వర్ హుస్సేన్, కరాటే అసోషియేషన్ నంద్యాల జిల్లా అధ్యక్షులు కళ్యాణ్, ప్రధాన కార్యదర్శి సూర్యవంశీ పాల్గొన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో యువకుడు మృతి

విశాలాంధ్ర - చాగలమర్రి : పట్టణంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన ప్రవీణ్ (30) అనే యువకుడు బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పగడాల నరసింహుడు కుమారుడు ప్రవీణ్ చిత్తూరు జిల్లా మదనపల్లెలో ప్రకృతి వ్యవసాయంలో ఉద్యోగం చేస్తున్నాడు. తన తోటి స్నేహితుడి వివాహానికి కర్నూలుకు గత రెండ్రోజుల క్రితం వెళ్లాడు. అక్కడ శుక్రవారం రాత్రి గదిలో ఒక్కసారిగా స్ట్రోక్‌కు గురై అస్వస్థతకు చేరుకున్నారు. వెంటనే స్నేహితులు కర్నూలు జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆలోపే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

పలువురు - నాయకుల సంతాపం: విషయం తెలుసుకున్న పలువురు ఉపాధ్యాయ సంఘ నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు సంతాపం తెలిపారు. టిడిపి మైనార్టిసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అన్సర్ బాషా, తెదేపా నంద్యాల బీసీసెల్ స్పోక్ 'పర్సన్ సల్లా నాగరాజు, తెదేపా మండల ప్రధాన కార్యదర్శి హనీప్, తెదేపా యువనాయకులు ఆవుల ప్రతాపలు ప్రవీణ్ మృతికి సంతాపం తెలిపారు. అలాగే విషయం తెలుసుకున్న ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డి దాగలమర్రికి చేరుకుని యువకుడి మృతికి సంతాపం తెలిపారు. కుటుంబీకులకు. ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు సంతాపం తెలిపిన వారిలో టీఎన్ టీయూసీ ప్రధాన కార్యదర్శి గుత్తినరసింహులు, తెదేపా నాయకులు రాజేంద్ర మహబూబ్ బాషా, ఎంపీపీ వీరభద్రుదు,వైకాపా మైనారిటీ సెల్ ప్రధానకార్యదర్శి బాబులాల్, చక్రంబీడీ షబ్బీర్, సీవీ, రమణ, గణేష్ రెడ్డి,మనోహర్రెడ్డి, ఖాదర్‌బాష, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : మున్సిపాలిటీ పరిధిలోని చింతకుంటలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శనివారం లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ పెంచడమే కాకుండా ఒకరోజు ముందుగానే పెన్షన్ పంపిణీ చేసి శభాష్ అనిపించుకున్న నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. పింఛన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి చంద్రబాబును తమ సొంత కొడుకు కంటే ఎక్కువగా చూసుకుంటున్నారన్నారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రారంభం అవుతుందని త్వరలోనే తల్లికి వందనం అందజేయడం జరుగుతుందన్నారు. మహానాడుతో టిడిపి ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న ఇష్టం తెలుస్తుందన్నారు. మహిళలు చింత కుంట్ల గ్రామంలో కాలువలు, సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. టీడీపీ నాయకులు చింతకుంట్ల రామశేఖర్ రెడ్డి, సోముల శేఖర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన వీసీ డాక్టర్ చంద్రశేఖర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఉప కులపతి డాక్టర్ చంద్రశేఖర్ రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఫరూక్‌ను నంద్యాల క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ఐఎంఏ మాజీ అధ్యక్షులు డాక్టర్ రవికృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏఈఆర్ ప్రసాద్‌లతో కలసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో తాను కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా, కర్నూలు జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్‌గా పని చేసే సమయంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా ఫరూక్ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి క్యాన్సర్ యూనిట్ కోసం, ఇతర అభివృద్ధి పనుల కోసం నిధులు కేటాయించిన విషయం గుర్తు చేసి మంత్రి ఫరూక్‌కు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాకు చెందిన వ్యక్తి ప్రతిష్టాత్మక డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం ఉపకులపతిగా రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేయడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి వైస్‌చాన్సలర్ డాక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు.

పింఛన్‌లు పంపిణీ చేసిన మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణం 10వ వార్డు నస్యం వీధిలో బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవిందు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ అందజేశారు. మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ పింఛన్ పంపిణీ చేసినప్పుడు లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం కనిపించిందన్నారు. ఇంచార్జి కమిషనర్ వెంకట దాస్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఏవిఆర్ ప్రసాద్, టిడిపి పట్టణ అధ్యక్షులు మనియార్ ఖలీల్, 19 వ వార్డు టిడిపి ఇంచార్జి షేక్ మున్నా, సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, మాజీ కౌన్సిలర్లు అజ్మీర్, మిద్దె హుస్సేనీ, ఫయాజ్, ఆసిఫ్, సమీయుల్లా మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా విజయ్ చౌదరి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో శ్రీశైలం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు శిల్పా చక్రపాణి రెడ్డి సహకారంతో వైసీపీ రాష్ట్ర యువజన విభాగం సెక్రటరీగా నియమితులైన కౌన్సిలర్ విజయ్ చౌదరి పట్టణ వైసీపీ కార్యాలయం నందు శ్రీశైలం నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, శిల్పా భువనేశ్వర్ రెడ్డిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

గురుకుల పాఠశాలకు దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : శ్రీశైలం ఐటీడీఏ అడ్మిషన్ కమిటీ చైర్మన్ ఆదేశాల మేరకు పట్టణంలోని పడకండ్ల రోడ్డులో ఉన్న ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల పాఠశాలలో ప్రవేశము కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.ప్రభాకర్ తెలిపారు. శనివారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో మూడు, నాలుగు, ఐదు, ఆరు, ఏడవ తరగతులకు ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. మూడవ తరగతిలో ప్రవేశానికి ఎస్టీ 31, ఎస్సీ 5, బీసీ 2, ఓసి 1, ఏఈక్యూ 1 సీట్లు ఉన్నాయన్నారు. నాలుగవ తరగతిలో ఎస్టీ 33, ఐదో తరగతిలో ఎస్టి-28, ఆరవ తరగతిలో ఎస్టి 18, ఏడవ తరగతిలో ఎస్టీ 5 సీట్లు ఉన్నాయన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు సంబంధిత ధ్రువపత్రాలతో పాఠశాలలో తమ దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు 96760 10006 నెంబర్‌కు సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పండగను శాంతియుతంగా జరుపుకోవాలి

విశాలాంధ్ర - వెలుగోడు: మండలంలో బక్రీద్ పండుగను మైనార్టీలు శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్సై సురేష్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో శనివారం శాంతి కమిటీ సమావేశము నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ఈ పండగలో ఎలాంటి సంఘటన జరగకుండా హిందువులు సహకరించాలని అన్నారు. శాంతి కమిటీ సభ్యులు మండ్ల శంకర రెడ్డి,గోవింద్, నసరుల్లాఖాన్, అమీర్జంజ,హీదాయత్, ఖలీల్, వీఆర్వో చక్రదర్ పాల్గొన్నారు.

నూతన ఆలయాలలో విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల : మండలంలోని ఎస్.చెన్నంపల్లి, బి.ఉప్పులూరు గ్రామాలలో నూతన ఆలయాలలో విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాల కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో వైభవంగా శనివారం నిర్వహించారు. ఎస్.చెన్నంపల్లి గ్రామంలో టీటీడి ఆర్థిక సహకారంతో సమరసత సేవా సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన సీత రామాంజనేయ దేవస్థానం నందు రెండు రోజులు పాటు వేద పండితులు విశేష పూజలు నిర్వహించి, మూడవరోజు అశేషంగా తరలివచ్చిన భక్తుల మధ్య ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని గావించారు. బి.ఉప్పులూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన స్వామి వారి విగ్రహ ప్రతిష్టను గావించారు. వేద పండితులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభ, విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని నిర్వహించారు. నూతన ఆలయాల విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఆయా గ్రామాలు బంధుమిత్రులు, నాయకులు, నేతలు, భక్తుల రాకతో కళకళలాడాయి. ఉప్పులూరు గ్రామంలో ఆలయ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా రాష్ట్ర రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరమ్మ, నాయకులు ఐవి పక్కీర రెడ్డి తదితరులు తరలివచ్చి పూజలో పాల్గొన్నారు. ఎస్.చెన్నంపల్లి, ఉప్పులూరు గ్రామాలలో నూతన ఆలయాల నందు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఎస్వీ కృష్ణారెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య తదితరులు ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

పోలీసులను సన్మానించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : నంద్యాల జిల్లాలో రిటైర్మెంట్ కాబడిన పోలీసులకు నంద్యాల జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా శాలువ, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పనిచేసి పదవీ విరమణ పొందడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ పొందిన వారిలో ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మయ్య, డిసిఆర్బి సీఐ శంకర్ రావు, ఆర్మడు రిజర్వ్ హెడ్ కానిస్టేబుల్ జగన్మోహన్ రెడ్డిలు ఉన్నారు. పదవీ విరమణ పొందిన తర్వాత ఏమైనా సమస్యలుంటే నన్ను సంప్రదించవచ్చని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులా.. మజాకా

సమావేశాల పేరుతో విధులకు డుమ్మా కొడుతున్నరని ఆరోపణలు

విశాలాంధ్ర - నంద్యాల రూరల్: నంద్యాల జిల్లా కేంద్రమైన మండలంలోని కార్యదర్శులు సమావేశాల పేరుతో గ్రామాలకు వెళ్లకుండా డుమ్మా కొడుతున్నారని నంద్యాల మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా నంద్యాల మండలంలో నేడు గ్రామాలకు సంబంధించి కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే గ్రామాలే పట్టుకొమ్మలని తెలుస్తుంది. కానీ నంద్యాల మండలంలోని పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ నిబంధన ప్రకారము ఆయా గ్రామాలలో నివసించాలని నిబంధనలు ఉన్నాయి. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వం 2022 జనవరి 1న ప్రత్యేకంగా గ్రామాలకు పంచాయతీ కార్యదర్శిలను నియామకం జరిగింది. ప్రస్తుతము గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రామాల అభివృద్ధి పాటుపడకుండా కలెక్టర్ ఆఫీసులో సమావేశాలు ఉన్నాయని, గ్రామలకు విధులకువెళ్లకుండా డుమ్మా కొడుతూ విధుల్లో కొనసాగుతున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు నానా ఇబ్బందులు పడుతూ ఆందోళన చెందుతున్నారని బహిరంగంగా ప్రజలు విమర్శిస్తున్నారు. కాగా గ్రామపంచాయతీ కార్యదర్శి ఆయా గ్రామాలలో విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీరు, పన్నులు వసూలు చేయుట అలాగే జనన మరణాల ధ్రువపత్రాలు, వివాహ రిజిస్ట్రేషన్ ధృపత్రాలు ప్రజలకు ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. కానీ ప్రస్తుతం గ్రామ కార్యదర్శులు పట్టణాల్లో నివాసం ఏర్పరచుకొని వారి ఇష్టానుసారంగా సమయానికి గ్రామాలను సంప్రదించకుండా, ప్రజల బాగోగులు పట్టించుకోకుండా కలెక్టర్ కార్యాలయంలో మీటింగ్ ఉందని విధులకు డుమ్మా కొడుతూ విధులు నిర్వహిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

ప్రభుత్వ నిబంధనలు గాలికి వదిలేసారు : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామాల అభివృద్ధి కొరకు వేలాది రూపాయలు గ్రామాలకు మంజూరు చేస్తున్న సర్పంచులు గ్రామ కార్యదర్శులు కలిసిపోయి మంజూరైన నిధులను తప్పుదోవ పట్టిస్తు ప్రజల అవసరాలను గాలికి వదిలేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం ఆనవాయితీగా మారింది. పంచాయతీ కార్యదర్శులు వివాహ రిజిస్ట్రేషన్ ధ్రువపత్రాలు ఇవ్వాలన్న, త్రాగునీటి కొరకు ఇంటికి కనెక్షన్ ఇవ్వాలన్న, త్రాగునీటి ట్యాంకులను 15 రోజులకు ఒకసారి పరిశుభ్రం చేయాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాల వల్ల దోమలు విపరీతంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సిన బాధ్యత వారిపై ఉంది. అయినా పంచాయతీ కార్యదర్శులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రభుత్వ నిబంధనలను గాలికి వదిలేసినట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజల కొరకు, దేశాభివృద్ధి కొరకు పాటుపడాలని మేధావులు కోరుతున్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

సులభంగా రుణాలు మంజూరు చేయాలి : జేసీ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: కౌలు రైతులకు సులభంగా రుణాలు మంజూరు చేయాలని, స్వయం సహాయక సంఘాలు రుణాలను సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య పేర్కొన్నారు. శనివారం ఉదయం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో 6వ జిల్లా కోపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 43 ప్రాథమిక సహకార సంఘాలు (ప్రాథమిక అగ్రికల్చర్ క్రెడిట్ కమిటీలు) కంప్యూటర్జేషన్ చేయడం జరిగిందని, డిస్టిక్ కోపరేటివ్ బ్యాంక్‌లు కూడా ఇతర జాతీయ కమర్షియల్ బ్యాంకుల లాగా లావాదేవీలు, నియమాలు పాటిస్తూ ఆన్‌లైన్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉన్నందువలన కొన్ని సెల్ఫ్ హెల్ప్ గ్రూపులను డిస్ట్రిక్ట్ కోపరేటివ్ బ్యాంకులకు ట్రాన్స్ఫర్ చేసే చర్యలు, క్రొత్తగా ఖాతాలు తెరిచే చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సిసిఆర్ కార్డ్స్ కలిగిన కౌలు రైతులకు సహకార బ్యాంకులు రుణాలు ఇవ్వాలని ఆదేశించారు. పొలం యజమాని పంట రుణాలు తీసుకుని ఉన్నట్లయితే అతని అకౌంట్‌ను హెూల్డ్ లో పెట్టి అతనికి మళ్లీ పంట రుణం ఇవ్వకుండా చూడాలని, సీసీఆర్ కార్డు కలిగిన కౌలు రైతుకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయం తర్వాత కౌలు రైతు సిసిఆర్ కార్డు ను రెన్యువల్ కూడా చేయవలసిందిగా ఆదేశించారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కర్నూలు జిల్లా మిల్క్ ఫెడరేషన్ సంఘాన్ని 15 రోజులలోగా స్థాపించవలసినదిగా ఇంచార్జీ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశానికి డిసిఓ రామాంజనేయులు, డ్వామా పిడి వెంకటరమణయ్య, జిల్లా కోపరేటివ్ బ్యాంక్ జనరల్ మేనేజర్, సీఈవో రామాంజనేయులు, అగ్రికల్చర్ జెడి వరలక్ష్మి, పిడి మెప్మా నాగ శివలీల, డిఎం సివిల్ సప్లై నాగ సుధా, మత్స్యశాఖ, మార్కెటింగ్, ఉద్యాన శాఖ, జిల్లా పరిషత్ ఏవో, అధికారులు పాల్గొన్నారు.

మోడీ విధానాలు దేశానికి ప్రమాదకరం : పి.రామచంద్రయ్య



విశాలాంధ్ర – పత్తికొండ: కేంద్రంలో మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలు దేశానికి ప్రమాదకరంగా ఉన్నాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామ చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి బి. గిడ్డయ్యలు అన్నారు. శనివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో సిపిఐ మండల సమితి సమావేశం పట్టణ కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరేంద్ర మోడీ అధికారంలోకి రాకముందు తాము అధికారంలోకి వచ్చిన వంద రోజులలోపే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని, ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారం చేపట్టి రెండు పర్యా యాలు పూర్తి అయినా ఏ ఒక్క హామీని నెరవేర్చింది లేదన్నారు. భారతదేశం లౌకిక దేశమని మతతత్వ బిజెపి కులాలు, మతాల మధ్య చిచ్చులు పెడుతూ దేశాన్ని హిందూ రాజ్యంగా మార్చి వేసేందుకు కుట్రలు పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో భద్రత వైఫల్యాల కారణం గానే ఉగ్రవాద దాడులు చోటుచేసుకుని 26 మంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారు అన్నారు. దేశంలో మతోన్మాదం, ఉగ్రవాదాన్ని రూపు మాపి దేశ సమైక్యత, సమగ్రత, లౌకిక పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రజలకు ఆచరణలో సాధ్యం కాని హామీలను ఇచ్చి, అధికారంలోకి వచ్చి సంవత్సరం పూర్తి కావస్తున్నా ఏ ఒక్కటి నెరవేర్చింది లేదన్నారు. సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై స్థానిక సమస్యల పరిష్కారానికి కలిసి వచ్చే పార్టీలతో ఉద్యమాలు చేసేందుకు పార్టీలు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇల్లు లేని నిరుపేదలకు పట్టణాల్లో రెండు సెట్లు, గ్రామాలలో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల రెండో తేదీన మండల కేంద్రాలలో జరిగే ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి డి.రాజా సాహెబ్, జిల్లా సమితి సభ్యులు గురుదాస్, కారన్న, సురేంద్ర కుమార్, తిమ్మయ్య, కృష్ణయ్య, శాఖా కార్యదర్శులు, పార్టీ ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే పింఛన్‌ల పంపిణీ రాష్ట్రంలోనే అధికం

విశాలాంధ్ర – కర్నూలు సిటీ : దేశంలోకెల్లా అధిక మొత్తంలో సామాజిక భద్రత పింఛన్లు పంపిణీ చేస్తున్న రాష్ట్రం ఏపీ ఒక్కటేనని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం 48వ వార్డు అమీర్ హైదర్ నగర్‌లో మంత్రి, నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబుతో కలిసి పలువురు లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. పింఛన్ల నగదు సక్రమంగా జరుగుతుందా, లేదా అని లబ్ధిదారులను ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీనిచ్చారు. బి.నాగమ్మక, సందేపోగు సుకుమార్, వడ్డే లక్ష్మీదేవి, యు.లక్ష్మన్నలకు వృద్ధాప్య, కె.డ్యాని, వి.రామకృష్ణలకు దివ్యాంగుల పింఛన్లు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ ఆదాయం సమకూర్చుకోలేని వివిధ వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకుని, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, వారికి క్రమం తప్పకుండా ప్రతి నెలా 1వ తేదీ, ఆరోజు సెలవు రోజు ఉంటే ఒకరోజు ముందే పింఛన్ల నగదు ఇచ్చేలా ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందన్నారు.

ఈ నెల 11న జిల్లాలో వైఎస్ షర్మిల పర్యటన

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి కర్నూలులో పర్యటిస్తారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలాని బాష తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన సమీక్ష సమావేశంలో జిలాని బాష మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. ఈ నెల 11న వైఎస్ షర్మిల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు కార్యకర్తల సమావేశానికి హాజరువుతారని తెలిపారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, నియోజక వర్గాల కోఆర్డినేటర్లు, జిల్లా కాంగ్రెస్ అనుబంధ సంస్థల నాయకులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని జిలాని బాష కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్ బాబు, కోడుమూరు కోఆర్డినేటర్ అనంతరత్నం మాదిగ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మహేంద్ర నాయుడు, తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర – నందవరం: పూలచింత గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని టిడిపి సీనియర్ నాయకులు, సర్పంచ్ బండే గురు స్వామి అన్నారు. శనివారం గ్రామ సచివాలయ ఆవరణలోఎమ్మిగనూరు విజన్ ప్లస్ ఐకేర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరికి కంటి సమస్యలు వస్తున్నాయని, వాటిని తీర్చేందుకు గ్రామాలలో ప్రైవేటు ఆసుపత్రిలు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాయని, వాటిని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఉచిత కంటి శుక్లాం ఆపరేషన్లు చేస్తారన్నారు. కంటి అద్దాలు తక్కువ ధరకే ఇస్తున్నారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు : కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : కారుణ్య నియామకాల కింద 50 మందికి జూనియర్ అసిస్టెంట్‌లుగా ఉద్యోగాలు ఇస్తూ శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందచేశారు. శనివారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులకు కలెక్టర్ నియామక ఉత్తర్వులను అందచేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో వెల్ఫేర్ మరియూ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లుగా 05 మందికి, పంచాయతీ సెక్రెటరీ జూనియర్ వీఐలుగా 04, వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలుగా 09 మందికి, మహిళా పోలీస్‌గా 01, రెవెన్యూ డిపార్ట్మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌లుగా 05 మందికి, వివిధ డిపార్ట్మెంట్లలో జూనియర్ అసిస్టెంట్లు గా 26 మందికి మొత్తం 50 మందికి జిల్లా కలెక్టర్ ఉద్యోగ నియామక పత్రాలను అందించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, కలెక్టరేట్ ఏవో విజయశ్రీ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : ఆంధ్రప్రదేశ్ పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ రాత పరీక్షలను కర్నూలు పట్టణంలోని 16 పరీక్షా కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సంధర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ రాత పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటుందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు జిల్లా ఎస్పీ సూచనలు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 9 గంటల నుండే పరీక్ష హాలులోకి అనుమతిస్తారన్నారు. ఉదయం 10 గంటల తర్వాత ఎట్టి పరిస్థితులలోనూ పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరన్నారు. హాల్ టికెట్‌తో పాటు బ్లూ లేదా బ్లాక్ బాల్ పెన్నులను తెచ్చుకోవాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేస్తారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఏలాంటి సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసుకునే విధంగా సంబంధిత పోలీసు చర్యలు తీసుకోవాలన్నారు.

మానసిక ఆరోగ్య విభాగాన్ని తనిఖీ చేసిన న్యాయమూర్తి

విశాలాంధ్ర – కర్నూలు ఎడ్యుకేషన్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి శనివారం నాడు పెంచికలపాడు నందుగల విశ్వభారతి జనరల్ ఆసుపత్రిలోని మానసిక వికలాంగుల విభాగాన్ని తనిఖీ చేయడం జరిగింది. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలతో మానసిక దివ్యాంగుల సంక్షేమం కొరకు, వారికి న్యాయ సహాయం అందించడం కోసం ఎల్ఎస్‌యు మం కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం వార్డు నందు గల మానసిక వికలాంగులను కలిసి వారితో మాట్లాడారు న్యాయపరమైన హక్కుల గురించి వారికి తెలిపారు. దివ్యాంగుల ఆరోగ్య, సంరక్షణ గురించి, వారికి అందుతున్న ఆహార, వైద్య సదుపాయాల గురించి అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వ భారతి హాస్పిటల్ ప్రిన్సిపల్ మునీరుద్దీన్ అహ్మద్ డాక్టర్ మహేంద్ర కుమార్, డాక్టర్ శివ శంకర్ రెడ్డి సైక్రియాటిస్ట్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రన్న భీమా చెక్కును అందచేసిన ఇంచార్జ్

విశాలాంధ్ర – మంత్రాలయం: మంత్రాలయం మండలం సుగురు గ్రామంలో శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మంత్రాలయం టీడీపీ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సచివాలయం సిబ్బందితో పాటు పింఛన్‌దారులకు పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట తప్పకుండా పింఛన్‌పంపిణీ చేయడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో చావిడి వెంకటేష్, లక్ష్మయ్య, భాస్కర్ రెడ్డి, నరసింహులు, గోపాల్, శేఖర్, రామకృష్ణ, ఇబ్రాయిల్, చంద్ర, పవన్, వేమిరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర – ఆస్పరి: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని టిడిపి రాష్ట్ర మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోనే పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నగదు అందజేశారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభు త్వంలో ఒకరోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ చేయడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకే సాధ్యమన్నారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధిలో దూసుకు వెళుతుందన్నారు. మాజీ ఎంపీపీలు రత్నమ్మ, తలారి వెంకటేశ్, కృష్ణయాదవ్, జనసేన మండల అధ్యక్షుడు అరవింద్, బిఎస్ఎన్ఎల్ మెంబర్ బత్తిన జీవన్ కుమార్, నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

కార్మికులకు వ్యక్తిగత రుణాలు ఇవ్వండి



విశాలాంధ్ర– కర్నూలు సిటీ: నగరపాలక సంస్థ ప్రజా ఆరోగ్య విభాగంలో పని చేయుచున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పారిశుద్ధ కార్మికు లకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కెఎంసి బ్రాంచ్ మేనేజర్ వై.రవికుమార్‌ను ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప, నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి, మున్సిపల్ నాయకులు ఎం.బాబూలాల్, ఎస్ సవారిలు బ్రాంచ్ మేనేజర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఎస్.మునెప్ప మాట్లాడుతూ నగరపాలక సంస్థలో సుమారు 13 వందల మంది కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ పద్ధతిలో పారిశుద్ధ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి నేటి వరకు వ్యక్తిగత రుణాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశుద్ధ కార్మికులకు వారి పిల్లల విద్య, వివాహ, ఆరోగ్య సమస్యలతో పాటు వ్యక్తిగత అవసరాల నిమిత్తం వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

బొంతిరాళ్ల కొండల్లో చిరుత పులి

విశాలాంధ్ర–కృష్ణగిరి: చిరుత తిరిగే ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామచంద్రుడు అన్నారు. మండలం బి.బొంతిరాళ్ల గ్రామ సమీపంలో గల వలిసే కొండపై గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లకు కొండపై చిరుత కనిపించడంతో అక్కడే డ్రైవర్లు తమ సెల్ ఫోన్ లో చిరుతకు సంబంధించిన ఫోటోలను కూడా తీశారు. ఈ విషయమై గ్రామంలో ప్రజలు, పసుల కాపరులు భయాందోళనలో ఉన్నారని గ్రామ సర్పంచ్ రవి మోహన్ జిల్లా ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు. గతంలో కూడా రెండు మూడు దఫాలు గ్రామ ప్రజలకు చిరుత పులి కనపడిందని చిరుత పులి నుండి ప్రాణం నష్టం జరగకుండా చూడాలని పులిని బంధించి అటవీ ప్రాంతంలోకి తరలించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన ఫారెస్ట్ అధికారులను కోరారు. స్పందించిన అధికారులు ఫారెస్ట్ బీట్ అధికారి రామచంద్రుడు, అసిస్టెంట్ బీట్ అధికారి కాలిదాస్ వచ్చి చిరుత తిరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలో సర్పంచ్ జె.రవి మోహన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ చిరుతకొండ ప్రాంతంలో ఉందన్నారు. గొర్రెల కాపారులు, అక్కడి పొలాల రైతులు అటు వైపు కొన్ని రోజులు అక్కడికి పోవద్దన్నారు.

వేగా జూవెల్లర్స్ ఆభరణాల అమ్మకాలు ప్రదర్శన ప్రారంభం



విశాలాంధ్ర – కర్నూలు సిటీ: నగరంలోని చిల్డ్రన్స్ పార్క్ ఎదురుగా ఓ హెూటల్లో శనివారం ఏర్పాటు చేసిన వేగా జ్యువెలర్స్ ఆభరణాల అమ్మకాలు, ప్రదర్శనను రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు రకాల వెరైటీ డిజైన్ల ఆభరణాలను పరిశీలించిన ఆయన నిర్వాహకులతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వేగా జ్యువెలర్స్ బ్రాంచ్ మేనేజర్ గౌరీ శంకర్, బాలదుర్గ ప్రసాద్‌లు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు యూఎస్ఏలో వేగా జ్యువెలర్స్‌కు బ్రాంచీలు ఉన్నాయని, వేగా జ్యువెలర్స్‌కు ప్రముఖ కథానాయకుడు నందమూరి బాలకృష్ణ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్పెషల్ బ్రైడల్ జ్యువెలరీ, గోల్డ్ జ్యువెలరీ, డైమండ్ జ్యువెలరీ, పోల్కి జ్యువెలరీ పలు డిజైన్ల ఆభరణాల అమ్మకాలు, ప్రదర్శనలో మ్యారేజి,హాఫ్ శారీస్ వేడుక, నూతన గృహప్రవేశాలకు అవసరమైన నూతన డిజైన్స్ ఆభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రతి పేషంట్ ఆదార్‌కార్డు లింక్

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల : ప్రతి పేషంట్ ఆదార్‌కార్డును లింక్ చేయడం జరుగుతుందని, పేషంట్‌కు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం సూపరింటెండెంట్ చాంబర్‌లో ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలోని హెల్త్ వర్కర్, లేదా పీహెచ్‌సీలలోనైనా, లేదా ఓపి సమయంలోనైనా పెషంట్ తన మొబైల్ అనుసందానం చేసిన ఆదార్‌కార్డు లింక్ చేసుకోవాలన్నారు. దీని వలన ఎక్కడి పోయిన వారి హెల్త్ డేటా చూస్తే అన్ని విషయాలు తెలుస్తాయని తెలిపారు. సర్వజన వైద్యశాల ప్రదాన ద్వారా గత కొన్ని సంవత్సరాలుగా మూతపడిందని దానిని తెరిపించి అక్కడి నుండి లోపలకు వచ్చి ప్రస్తుతం వాడుతున్న గేట్ ద్వారా బయటకు పోయేందుకు ఉపయోగిస్తామన్నారు. దీని వలన ట్రాఫిక్‌ను అధిక మించవచ్చన్నారు. దీనికి తోడు వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారిందన్నారు. డాక్టర్లు, వైద్యశాల సిబ్బంది, మెడికల్ కాలేజి విద్యార్థులకు చెందిన వాహనాలు అధికంగా ఉండటం దీని తోడు పేషంట్లు, వారి కొరకు వచ్చే వారి ద్విచక్ర, కార్ల పార్కింగ్‌కు సంబంధించి ఎక్కడికక్కడ నియంత్రించేందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.మంత్రి టీజీ భరత్, కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే వైద్యశాల అభివృద్ధికి చెందిన అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

ఇద్దరు చైర్‌పర్సన్‌లు మారినా కౌన్సిలర్ సమస్య పరిష్కారమేది

విశాలాంధ్ర – ఆదోని : ఆదోని మున్సిపల్ కౌన్సిల్‌లో చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఇద్దరు చైర్‌పర్సన్‌లు మారిన పట్టణంలోని 25వ వార్డు కౌన్సిలర్ సయ్యదాన్‌బి వార్డులో గత నాలుగేళ్లుగా పైపులైన్ ఏర్పాటు కోసం పోరాటం చేస్తున్న తోటి కౌన్సిలర్లు, చైర్‌పర్సన్‌లు, అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని చెప్పవచ్చు. కౌన్సిలర్ అధికారులను ప్రశ్నించగానే తూతూమంత్రంగా వచ్చి సమాధానం చెప్పడమే పరిపాఠిగా పెటుకున్నారు. శనివారం చైర్‌పర్సన్ లోకేశ్వరి అధ్యక్షతన 17 అంశాల అజెండాతో పాటు 5అంశాల టేబుల్ అజెండా సమావేశం జరిగగా 10 అంశాలను కౌన్సిల్ సభ్యులు వాయిదా వేశారు. అత్యవసరం కోసం నీటి ట్యాంకులను కౌన్సిలర్‌లకు కూడ పంపకుండ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, బక్రీద్ పండుగ సంధర్భంగా పట్టణంలో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించి, వ్యర్థాలను పారబోసేందుకు ప్లాస్టిక్ సంచులు ఇవ్వాలని 8వ వార్డు కౌన్సిలర్ ఉస్మాన్‌బాష అధికారులను కోరారు. మెడికల్ హెల్త్ ఆఫీసర్ కౌన్సిల్ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండ సొంత నిర్ణయాలు తీసుకోవడం సబబు కాదని 36వ వార్డు కౌన్సిలర్ సందీప్‌రెడ్డి అన్నారు. హిందు స్మశాన వాటికలో నెలకొన్న సమస్యను పరిష్కరించి, క్రిమిటోరియం ఏర్పాటు చేసి కౌన్సిల్ ప్రతిష్టను పెంచాలని కౌన్సిలర్ సందీప్‌రెడ్డి చైర్‌పర్సన్, కౌన్సిలర్లను, అధికారులను కోరారు. ఆదోని గొప్పతనాన్ని చూపే జైహింద్ ఆర్చ్ శిథిలా వస్థకు చేరుకుందని, వెంటనే నూతన ప్రవేశ ద్వారాన్ని ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ చలపతి కోరారు. పట్టణంలోని ప్రధాన రోడ్లలో ట్రాఫిక్ సమస్యను, జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని 3 అడుగుల ఎత్తులో డివైడర్లను ఏర్పాటు చేయాలని కౌన్సిలర్ బాలాజీ అధికారులను కోరారు. కౌన్సిల్ సమావేశానికి కొంత మంది అధికారులు గైర్హాజరు అవుతున్నారని కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ కృష్ణ, అసిస్టెంట్ కమీషనర్ అనుపమ, ఎంఈ ఇంతి యాజ్ అలీ, డీఈ వెంకటచలపతి, టీపీఓ బాలమద్దయ్య, ఏఓ రవిచంద్ర, ఆర్ఐ చంద్రశేఖర్, సీ–1 జుబియా, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రంజిత్, డెలికేషన్ ఏఈలు పావని, భువన్‌చంద్రారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ అభివృద్ధితోనే సాధ్యం

విశాలాంధ్ర – తుగ్గలి: మండల కేంద్రమైన తుగ్గలి తహశీల్దార్ కార్యాలయ ఆవరణములో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ప్రభుత్వ రేషన్ షాప్ డీలర్లు కొంతమంది పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాప్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు పగిడిరాయి సుంకన్న,గౌరవ అధ్యక్షులు ఎర్రగుడి చంద్రశేఖర్ యాదవ్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం అని అన్నారు. ఎన్నో ఏండ్ల నుండి ఉన్న డీలర్ వ్యవస్థ ద్వారా పేద ప్రజలు బియ్యం వేయించుకొని వెళ్లేవారని తెలిపారు. గత ప్రభుత్వంలో పాలకులు ఎండియు వాహనాలు ద్వారా ప్రజలకు ఇంటింటికి బియ్యం పంపిణీ లో వైఫల్యం చెందారని ఆరోపించారు. ఎవరికి ఇబ్బంది లేకుండా మరల డీలర్ వ్యవస్థ ద్వారా షాప్ దగ్గరే రేషన్ తీసుకు వెళ్లే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత కొన్ని ఏళ్ళు ఉన్న డీలర్ వ్యవస్థను పునఃప్రారంభించి ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించారని వారు పేర్కొన్నారు. మండలంలోని ప్రభుత్వ రేషన్ షాప్ డీలర్లు రామచంద్రారెడ్డి, గౌరన్న, తిమ్మప్ప, రామచంద్ర, వెంకటేశ్వర్ రెడ్డి, రంగనాయకులు, బసవరాజు, రంగస్వామి పాల్గొన్నారు.

తక్షణమే ఇంటి స్థలాలు మంజూరు చేయాలి



విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: కూటమి ప్రభుత్వ అధికారం లోకి వచ్చి సంవత్సరం కాలం కావస్తున్న ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన వాగ్దానం మేరకు పట్టణాల్లో 2 సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు స్థలాలు ఏవి అంటూ ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ కార్యాలయంలో ఏపీ మహిళా సమాఖ్య ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ మహిళా సమాఖ్య పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వాణి, ఈరమ్మ మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం కలర్ ఫుల్ బ్రోచర్లపై సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామని ప్రజలకు వాగ్దానం, ప్రమాణం చేసి అధికారంలోకి రావడంజరిగిందన్నారు. ఇంటి స్థలాలు సాధనకై ఈ నెల 2న సిపిఐ రాష్ట్ర సమితి పిలుపుమేరకు తాహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నాకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలి రావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య కార్యకర్తలు చాముండి, వెంకటలక్ష్మి, రేణుక, నాగవేణి, సావిత్రమ్మ, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలోని 2,37,200 మందికి పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద జూన్ మాసంలో జిల్లాలో అర్హులైన 2 లక్షల 37 వేల 200 మంది పెన్షన్ లబ్ధిదారులకు రూ.103.35 కోట్లు పంపిణీ చేయడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. శనివారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీలో భాగంగా నగరంలోని దేవనగర్‌లో జాన్సీ రాణి, సల్మాబీలకు వృద్ధాప్య పింఛన్, తోట మీనాక్షి, ఆది లక్ష్మీలకు వితంతువు పెన్షన్, నిర్మల, శివ శంకర్‌లకు వైకల్య పింఛన్, షేక్షావలికి బోదకాలు ట్రీట్మెంట్‌కి సంబంధించిన పింఛన్‌లను వారి ఇంటి వద్దకే వెళ్లి కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎక్కువ సంఖ్యలో పెన్షన్ లు పంపిణీ చేస్తున్న జిల్లా కర్నూలు జిల్లా అని తెలిపారు. కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, కర్నూలు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర బాబు, డిఆర్డిఎ పిడి రమణారెడ్డి పాల్గొన్నారు.

కొలతల ప్రకారం పని చేసి వేతనం పొందాలి

విశాలాంధ్ర – సి.బెళగల్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి వెళ్లే ప్రతి ఒక్కరూ కొలతల ప్రకారం పనిచేసి రూ.307 రూపాయల వేతనాన్ని పొందాలని ఎమ్మిగనూర్ క్లస్టర్ ఏపీడి అల్లిపీరా అన్నారు. శనివారము మండలంలో జరుగుతున్న యోగాంధ్ర రిజిస్ట్రేషన్ గ్రామపంచాయతీ వారిగా ఎంత చేశారన్న వివరాలను ఎంపిక రామన్నను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి శ్రామికులు పనిచేస్తున్న లీడర్ కాలువ పనులను, తనిఖీ చేశారు. ఎపిడి మాట్లాడుతూ ఉపాధి హామీ పనికి వెళ్లే ప్రతి ఒక్క శ్రామికుడు కొలతల ప్రకారం పనిచేసి ప్రభుత్వం ఇచ్చే రూ.307 వేతనం కచ్చితంగా పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిడితోపాటు ఏపీఓ రామన్న, టిఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితర ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పదవి విరమణ చేసిన అధికారికి ఘనంగా సన్మానం

విశాలాంధ్ర – సి.బెళగల్: సర్వీస్ పూర్తయి పదవి విరమణ అయిన అధికారికి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం మండల కేంద్రమైన తహశీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కార్యాలయం నందు ఆఫీస్ సబ్ ఆర్డినేట్‌గా పని చేయుచున్న జి.రంగన్న పదవీ విరమణ చేసిన ఆయనకు తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మాణించడం జరిగినది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఆర్ఎస్‌డిటి వెంకటేశ్వర్లు ఆర్ఐ తరుణ్, ఎఎస్ఓ, జూనియర్ అసిస్టెంట్లు, విఆర్‌ఓలు, వివిఎస్‌లు, విఆర్ఎలు, కంప్యూటర్ ఆపరేటర్లు తదితర రెవిన్యూ సిబ్బంది వారి బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ విద్యుత్ శాఖలో ఖాళీలను భర్తీ చేయాలి



విశాలాంధ్ర – ఆస్పరి : రాష్ట్రంలో విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 10 వేల పైచిలుకు ఉద్యోగాలు తక్షణమే భర్తీ చేయాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మన్న, రమేష్ లు డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోనే కైరుప్పల గ్రామంలోని కామ్రేడ్ బండమీది వెంకటేశ్వర్లు భవనంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విద్యుత్ ఉత్పత్తి, పంపిణీ, సరఫరా సంస్థలలో దాదాపు పదివేలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ప్రస్తుతం పనిచేస్తున్న ఉద్యోగులు పై పని భారం పడుతున్నది పనిభారంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారన్నారు. ప్రతి సంవత్సరం డిగ్రీ పట్టభద్రులై నిరుద్యోగులుగా ఉద్యోగాల కోసం చాలా సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు అని అన్నారు. విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలు భర్తీ చేయటం వలన ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులు పని భారం తగ్గించడంతో పాటు ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మండల సహాయ కార్యదర్శి సురేష్, శేఖర్ ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షులు అనిల్, నాయకులు శివ, జశ్వంత్, బాలు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సాగు భూములకు పట్టాలు మంజూరు చేయాలి

విశాలాంధ్ర – ఆస్పరి: మండల పరిధిలోనే కైరుప్పల గ్రామం రెవిన్యూ పరిధిలో 578 సర్వే నెంబర్ లో సాగు బడిలో ఉన్న దళితులకు భూహక్కు పట్టాలు మంజూరు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు ముద్దు రంగన్న, కృష్ణమూర్తిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు కైరుప్పల గ్రామ దళితులతో కలిసి డిహెచ్‌పి ఎస్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్లకు పైగా కైరుపుల గ్రామ రెవిన్యూ పరిధిలోనే 578 సర్వే నంబర్‌లో 23 ఎకరాల భూమిని కైరుప్పల గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం అదే భూమిలో నర్సరీ ద్వారా ప్రభుత్వం వారు మంజూరు చేసిన మామిడి, సపోటా, నారింజ, నిమ్మ తదితర పళ్ళు మొక్కలను నాటుకోవడం జరిగిందన్నారు. ఆ సమయంలో సరైన వర్షాలు లేక పోవడం మరో రకంగా సౌడు భూమి కావడంతో పొలంలో నాటిన పళ్ళు మొక్కలు ఎండిపోవడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్నా మా భూములను కొంతమంది బినామీలు నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలను సృష్టించుకొని ఆన్ లైన్ అడంగల్‌లో ఎక్కించుకొని ఈ భూములు మావి అంటే మాపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం ఉదయం సజ్జ, కంది పంట విత్తనాలను ట్రాక్టర్ యంత్రాల ద్వారా పొలం దున్నుతుండగా బిల్లేకల్ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడి కుటుంబ సభ్యులు మాజీ సర్పంచ్ తలారి సంజమ్మ, తలారి కృష్ణ, తలారి ప్రకాష్ లతో పాటు కొంతమంది అగ్రకులస్తులను మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంట తీసుకువచ్చి ఈ పొలం మేము కొన్నామని దళిత సాగు దారులపై దౌర్జన్యం చేయడం ఎంతవరకు సబమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కైరుప్పల గ్రామ దళితులు లక్ష్మి, శారదమ్మ, గాయత్రి, వీరేశమ్మ, శ్రీదేవమ్మ, రంగమ్మ, సుంకన్న, ఆవుల లక్ష్మన్న పులికొండ బజారి, వీరేష్, నాగరాజు, రంగప్ప, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, ఆదివారం 01, జూన్ 2025

ఓ రోజు ముందుగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: పట్టణ పరిధిలోని సంతపేటలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న టిడిపి రాష్ట్ర కార్యదర్శిగడ్డం రామకృష్ణారెడ్డి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ ఒకరోజు ముందుగానే చేయడం పంపిణీ జరిగిందన్నారు. సంక్షేమ పథకాల పండుగ కడపలో జరిగిన మహానాడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజలకు ఎన్నికల నేపథ్యంలో హామీ ఇచ్చినట్లుగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు, ఉచిత గ్యాస్, రాబోవు జూన్ నెలలో అమ్మకు వందనం, అన్నదాత సుఖీభవ, ఆగస్ట్ నుండి మహి ళలకు ఉచిత బస్సు సౌకర్యం అమలు చేయబోతున్నారని రాష్ట్రవ్యాప్తంగా పారిశ్రామికరణ అనేకమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి గత ఐదు సంవత్సరాలలో ఆంధ్ర రాష్ట్ర కోల్పోయినటువంటి పెట్టుబడిలాని సాధించి రాష్ట్రాన్ని రాష్ట్ర ప్రజలను అభివృద్ధిలో ముందు వరసల లో నారా చంద్రబాబు నాయుడు ఉంచుతారని తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆయా శాఖల అధికారులు అప్రమత్తం ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : వర్షాకాలం మొదలైనందున ఇరిగేషన్, పంచాయతీ, గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు అప్రమత్తం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, జిల్లా అధికారులతో కలెక్టర్ యోగాంధ్ర, హౌసింగ్, రెవిన్యూ, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం మొదలైనందున లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలవకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని వరద వచ్చే ఇబ్బంది ఉన్న ప్రాంతాలను పరిశీలించాలని, కెనాల్స్, చెరువు కట్టల వద్ద మరమ్మత్తులు ఏమైనా చేయాల్సి ఉంటే వాటిని చేపట్టాలని కలెక్టర్ జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే మున్సిపాలిటీల్లో, గ్రామపంచాయతీల్లో డ్రైనేజ్ బ్లాక్ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ మున్సిపల్ కమిషనర్లను ఈవో పీఆర్డీ లను ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా అధికారులు వాటర్ పైప్ లైన్ లను చెక్ చేయాలని, ఓ.హెచ్.ఎస్.ఆర్ లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయించాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు యాంటీ లార్వా, ఫాగింగ్ తదితర కార్యక్రమాలను చేపట్టి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలోపు ఈ శాఖల అధికారులు ఇందుకు సంబంధించిన నివేదికను తనకు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే వారిని రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. పెద్దకడబూరు మండలం రిజిస్ట్రేషన్ లో చాలా వెనుకబడి ఉందని, అలాగే దేవనకొండ, ఎమ్మిగనూరు, కోసిగి, బెళగల్, మంత్రాలయం, కర్నూల్ రూరల్ మండలాలు కూడా రిజిస్ట్రేషన్ చేయడంలో పురోగతి తీసుకుని రావాలన్నారు. కర్నూలు అర్బన్, గోనెగండ్ల మండలాలు రిజిస్ట్రేషన్ చేయడంలో ముందున్నాయన్నారు..అలాగే జూన్ 21 వ తేదీన యోగా దినోత్సవం నిర్వహించేందుకు అన్ని గ్రామాల్లో, మున్సిపాలిటీ లలో వేదికలు గుర్తించాలని, యోగా చేసేందుకు వీలుగా వసతుల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. హౌసింగ్ ఫర్ ఆల్‌కి కార్యక్రమంలో భాగంగా ఇళ్ల స్థలాలు లేని పేదల నుండి దరఖాస్తులు తీసుకోవాలని, చెప్పినప్పటికీ ఈ అంశంలో పురోగతి లేదన్నారు.ఇళ్ళ నిర్మాణాలను వేగవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.పిఎం సూర్యఘర్‌కు సంబంధించి 80 వేల రిజిస్ట్రేషన్ లు చేయడం జరిగిందని, వారితో మాట్లాడి, రుణాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎంపిడిఓ లను ఆదేశించారు. జేసీ డా.బి.నవ్య, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డిలు పాల్గొన్నారు.

తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలి

విశాలాంధ్ర - సి.బెళగల్: రైతులు పత్తి విత్తనములు విత్తేముందు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర అన్నారు. శనివారం మండల పరిధిలోని కంబదహాల్ రైతు సేవ కేంద్రం నందు కృషి విజ్ఞాన కేంద్రం బనవాసి వారి ఆధ్వర్యంలో సి బెలగల్ మండల వ్యవసాయ అధికారి జి మల్లేష్ కుమార్ అధ్యక్షతన వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్య క్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ ప్రత్తి, మిరప, ఉల్లి పంటలలో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. ప్రత్తి విత్తనాలు నాటేటప్పుడు కచ్చితంగా రైతులు విత్తన శుద్ధి చేసుకోవాలని, సాలుకు సాలుకు మూడు అడుగుల దూరం, మొక్కకు, మొక్కకు అడుగు దూరంలో నాటుకోవాలని ఆయన అన్నారు. కంది పంటలో స్వల్పకాలిక రకాల గురించి, దీర్ఘకాలిక రకాల గురించి రైతులకు తెలియజేశారు. కర్నూలు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు సాలురెడ్డి మాట్లాడుతూ ఒకే పంట కాకుండా అంతర పంటలు వేసుకోవాలని తద్వారా ప్రధాన పంటకు అయ్యే ఖర్చును అంతర పంటల ద్వారా సమకూర్చుకోవాలని అన్నారు. పీఎండిస్ కిట్‌ను రైతులకు అందజేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ విధానంలో వేసిన పిఎండిస్ పంటను చూడడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శివకృష్ణ, డిఆర్సి ఏడీఏ గిరీష్,మండల వ్యవసాయాధికారి మల్లేష్ కుమార్, వీహెచ్ఏ శశిదేవి తదితర వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

షర్మిళ పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: రాష్ట్ర పిసిసి అధ్యక్షురాలు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తున్న సభను విజయవంతం చేయాలని బనగానపల్లె నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బాలు యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా బాలు యాదవ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించాలని షర్మిళ చేపడుతున్న పర్యటన భాగంగా ఈనెల 12 తారీఖున నంద్యాలకు రానున్న షర్మిలమ్మ పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు.

డీఈఈసీఈటీ టెస్టును రేపు నిర్వహిస్తాం

విశాలాంధ్ర - కర్నూలు ఎడ్యుకేషన్: డీఈఈసిఈటి జిల్లాలో 05 సెంటర్లు ఏర్పాటు చేయడమైనది. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.సామెల్ పాల్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యర్థులు హాల్ టిక్కెట్లను https://apdeecet.apcfss.in వెబ్‌సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. డిఈఈసిఈటి కంప్యూటర్ ఆధారిత పరీక్ష ఈ నెల 2న నుంచి జరుగుతాయన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుండి 4:30 గంటల వరకు జరుగుతుందన్నారు.

మతసామరస్యాన్ని చాటండి

విశాలాంధ్ర - శిరివెళ్ల : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే బక్రీద్, పండుగను సోదర భావంతో శాంతియుత వాతావరణంలో జరుపు కోవాలని శిరివెళ్ల సర్కిల్ ఇన్స్పెక్టర్ దస్తగిరి బాబు, సబ్ ఇన్స్పెక్టర్ చిన్న వీరయ్య యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో హిందూ ముస్లిం మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ దస్తగిరి బాబు మాట్లాడుతూ బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో పరస్పరం మతాలను గౌరవించుకుంటూ పండుగ జరుపుకోవాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. సోదర భావంతో మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మత పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా వ్యవహరించాలన్నారు. చట్టాన్ని ఏవరు తమ చేతుల్లోకి తీసుకొని శాంతి భద్రతలకు విఘాతం కల్పించే పరిస్థితులు తీసుకొనిరావద్దని అన్నారు. ఏదైనా సమస్య వుంటే సామరస్య పరిష్కారానికి పోలీస్ అధికారులు నిరంతరం అందుబాటులో వుంటారని అన్నారు.

90శాతం పింఛన్‌లు పంపిణీ

విశాలాంధ్ర - మిడుతూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో ఉన్న పెన్షన్ లబ్ధిదారులకు 90 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీవో దశరథ రామయ్య తెలిపారు. శనివారం మండలంలో పంపిణీ చేస్తున్న పెన్షన్ పంపిణీని ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో 5275 మంది పెన్షన్ దారులు ఉండగా 4738 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని అందజేసినట్లు వెల్లడించారు. మిగిలిన లబ్ధిదారులకు త్వరలోనే అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులు అరెస్ట్

విశాలాంధ్ర- ఆదోని / ఆదోని క్రైం: ఆన్‌లైన్ ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న 7మందిని అరెస్టు చేసి వారి వద్ద నుండి రూ.91లక్షలు నగదుతో పాటు 7 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ వెల్లడించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ బెట్టింగ్ వ్యసనానికి అలవాటు పడ్డ యువత అప్పులు చేసి తల్లిదండ్రులకు చెప్పుకోలేక బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తమ కుటుంబ సభ్యుల ఆశలను అడిఆశలు చేయొద్దని సూచించారు. బెట్టింగ్‌పై జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా వుంచడంతో ఆదోని డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో ఆదోని పట్టణ సీఐ శ్రీరామ్ రాబడిన సమాచారం మేరకు ఈ నెల 18వ తేదిన వాల్మీకీనగర్‌లో సెల్‌ఫోన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠాపై దాడి చేయగా ఆర్ నాగరాజును అదుపులో తీసుకోగా మిగిలిన ముద్దాయిలు పారిపోయారు. నిందితుడి నుండి రూ.50వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో సీఐ శ్రీరామ్ సిబ్బందితో కర్నూలు, హైదరాబాద్, ఒంగోలు, చిలకలూరుపేట, బెంగళూరు ప్రాంతాల్లో గాలించి శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ కొండ ప్రాంతంలో ఆదోనికి చెందిన మసీదుపుర ఇస్మాయిల్, బోయ మహానంది, బోయరమేష్, బెంగుళూరుకు చెందిన ఎస్ రాజేష్, ఒంగోలుకు చెందిన చుండిశ్రీనివాసరావు అలియాస్ నాయుడు, అడ్డాల కళ్యాణ్, హైదరాబాద్‌కు చెందిన రఘుఆచారి(అయిజ)లను అరెస్టు చేసి 7 సెల్‌ఫోన్‌లు రూ.91లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగింది. క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకులు నేషనల్ ఎక్స్చేంజ్, రాధే ఎక్స్చేంజ్, వజ్రా ఎక్స్చేంజ్, నేషనల్ 777, మోర్ ఎక్స్చేంజ్ బెట్టింగ్ యాప్స్ ద్వారా బెట్టంగ్ నిర్వహిస్తున్నారని ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి సాంకేతిక పరిజ్ఞానంతో క్రికెట్ బుకీలను అరెస్టు చేయడంలో ప్రతిభ కనబరిచిన ఆదోని డీఎస్పీ హేమలత, పట్టణ సీఐ శ్రీరామ్, సిబ్బంది మునిస్వామి, రంగస్వామి, ఏకవీర, ఫక్కీరప్ప, హుసేన్‌బాలను ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. పెద్ద మొత్తంలో బెట్టింగ్ రాయుళ్లను అరెస్టు చేయడంతో పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శనగల బసవన్న విగ్రహం కలశాలతో ఊరేగింపు

విశాలాంధ్ర - ఆస్పరి : మండల పరిధిలోని బిణిగేరి గ్రామంలోని శ్రీగిరి క్షేత్రంలో ఈ నెల 5దీన నూతన విగ్రహల ప్రతిష్ఠాపన ను పురస్కరించుకొని శనివారం గ్రామానికి భారీ ఎత్తున ఉంటే శనగల బసవన్న విగ్రహం తో పాటు రత్నగర్భ గణపతి, శ్రీ కామేశ్వరి దేవి, పులి వాహనము, నందీశ్వరుడు విగ్రహాలు రావడంతో భక్తులు మేల తాళాలు మంగళ వాయిద్యాలు కలశాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు శ్రీనివాసులు నాయన మాట్లాడుతూ ఈనెల 5వ తేదీన శ్రీగిరి క్షేత్రంలోని పంచలింగేశ్వర స్వామి ఆలయంలో నూతన విగ్రహల ఏర్పాటు కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనట్లు తెలియజేశారు. జూన్ 2వ తేదీ నుండి 5వ తేదీ వరకు శ్రీగిరి క్షేత్రంలో జరుగు పూజ కార్యక్రమాలను తెలియజేశారు. నూతన విగ్రహ ప్రతిష్ఠాపన పురస్కరించుకొని జూన్ రెండవ తేదీన సాయంత్రం గణపతి పూజ, సాయంత్రము శంకరబండ శాంతి రెడ్డి వారిచే వేమారెడ్డి మల్లమ్మ నాటక ప్రదర్శన, మూడవ తేదీ ఉదయం విగ్రహమూర్తులకు ప్రత్యేక పూజలు, హెూమములు, రాత్రి శ్రీనిధి ఇన్స్టిట్యూట్ బళ్ళారి వారిచే భరతనాట్య ప్రదర్శన, నాలుగవ తేదీన ఉదయం పంచలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, హెూమం, దాన్యాదివాసము, శయ్యాదివాసములు, రాత్రి సద్గురువులచే ఉపన్యాసం, ఐదవ తేదీన పంచలింగేశ్వర స్వామి ఆలయంలో శ్రీ రత్నగర్భ గణపతి, శ్రీ కామేశ్వరి దేవి, పులి వాహనము, నందీశ్వరుడు, శనగల బసవన్న, దేవతమూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపనను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు నాయన తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టామని, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు

ప్రజల ఆరోగ్య విషయంలో రాజీ లేదు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ప్రజల ఆరోగ్య విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. శనివారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మున్సిపాలిటీ అభివృద్ధి కొరకు తీసుకునే చర్యల గురించి మాట్లాడారు. చికెన్, మటన్ దుకాణాల్లో నాణ్యత లేని మాంసాన్ని విక్రయిస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్ తన దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ప్రజల ఆరోగ్య విషయంలో తాను రాజీపడే ప్రసక్తే లేదని మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు. రెగ్యులర్‌గా తనిఖీ చేయాలని ఆమె ఆదేశించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా పెరిగిపోయిందని మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పోలీస్ శాఖతో కలిపి ఐదు మందితో కమిటీ ఏర్పాటు చేసుకొని ట్రాఫిక్ నియంత్రణ సంబంధిత వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో పందులు, కుక్కలు ఎక్కువగా ఉన్నాయని వీటితో సమస్య ఎక్కువగా ఉందని సంబంధిత యజమానులకు చెప్పి వాటిని నియంత్రించాలన్నారు. పన్నుల చెల్లింపులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధికి సంబంధించి ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, మున్సిపాలిటీ అద్దె గదులు, ట్రేడ్ లైసెన్స్ లో కచ్చితంగా ప్రతి ఒక్కరూ కట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది ద్వారా టాక్స్ కలెక్షన్ చేసే విధంగా అధికారులు చర్యలు చూపాలన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధి మన చేతుల్లోనే ఉందని ప్రభుత్వం మీద ఆధార పడకుండా మనమే అభివృద్ధి చేసుకునే విధంగా పనిచేయాలన్నారు. 2027 సంవత్సరానికి రూ.18 కోట్లు ఆదాయం వచ్చే విధంగా పని చేయాలని తాను మానిటరింగ్ చేస్తానన్నారు. ఆళ్లగడ్డ పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థ అధ్వానంగా ఉందన్నారు. రూ.122 కోట్ల వ్యయంతో మున్సిపాలిటీ పరిధిలో డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల్లో కంప చెట్లు విపరీతంగా పెరిగిపోయాయని రోడ్లు మూసుకుని పోతున్నాయన్నారు. ప్రవేట్ స్థలాల యజమానులకు నోటీసులు జారీ చేసి వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌన్సిలర్లు విధిగా సమావేశాలకు హాజరు కావాలన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అధికారులు ఆళ్లగడ్డ మున్సిపాలిటీలో జరిగే అభివృద్ధి పనులపై అజెండాను వివరించడం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్, వైస్ చైర్మన్, డాక్టర్ రామలింగారెడ్డి, నాయబ్ రసూల్, మున్సిపల్ కమిషనర్ కిషోర్, ఇంచార్జ్ శానిటరీ ఇన్స్పెక్టర్ బాలస్వామి, ఏఈ తేజ రెడ్డి, కౌన్సిలర్లు హుస్సేన్ భాష, బాలబ్బి, గురుమూర్తి, శ్రీవిద్య తదితర కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పొగాకు వాడకం అనారోగ్యానికి మూలం

విశాలాంధ్ర - రుద్రవరం: పొగాకు వాడటం అనారోగ్యానికి మూల కారణమవుతుందని నరసాపురం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బాబు అన్నారు. శనివారం మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవంను నిర్వహించారు. సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి గ్రామంలో నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వాడటం వల్ల మనిషిలోని ప్రతి అవయవము చెడిపోవడం జరుగుతుందన్నారు. చుట్ట, బీడీ, సిగరెట్ వాడటం వల్ల క్యాన్సర్ కు కారణం అవుతారన్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధులు రావడం జరుగుతుందన్నారు. ధూమపానం వల్ల గుండె జబ్బులు రావడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరు ధూమపానానికి దూరంగా ఉంటూ సుఖమయమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని ప్రతి ఒక్కరు జీవించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్, ఎమ్మెల్ హెచ్పిలు, ఏఎన్ఎంలు, పలువురు ఆశాలు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వెంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర - బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో శ్రీ వెంకటేశ్వరస్వామి నూతన ఆలయం విగ్రహా ప్రతిష్టా మహోత్సవం కార్యక్రమం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రోడ్లు భవనాలు పెట్టుబడులు మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రికి ఆలయ సాంప్రదాయం ఆలయ పురోహితులు, ఆలయ నిర్వాహకులు, గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు అంబాల రామకృష్ణారెడ్డి, అంబాల ప్రభాకర్ రెడ్డి, చల్లా మద్దిలేటి, శంకర్, చల్లా చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి డీలర్ల వద్ద రేషన్ పంపిణికి చర్యలు

విశాలాంధ్ర - వెలుగోడు: వెలుగోడు మండలంలో నేటి నుంచి పాత పద్ధతి ప్రకారమే డీలర్ల వద్ద రేషన్ పంపిణీకి చర్యలు చేపట్టినట్లు తహసిల్దార్ శ్రీనివాసులు గౌడ్ శనివారం తెలిపారు. గత వైసిపి ప్రభుత్వం ఇంటింటికి రేషన్ పంపిణీ అనే పద్ధతిలో ప్రజలకు రేషన్ బండ్ల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేయడం జరిగింది. రేషన్ బండి నిర్వాహకులు ఇంటింటికి సరుకులను చేరవేయకుండా కేవలం ఒక కూడలి వద్ద బండిని ఆపుకొని రేషన్ సరుకులను పంపిణీ చేయడం జరిగింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ బండి వద్ద సరుకులను ప్రజలకు పంపిణీ చేయడం విధానాన్ని రద్దుచేసి, పాత పద్ధతి ప్రకారం దీనుల వద్ద నుంచే రేషన్ సరుకులను ప్రజలు తీసుకునే విధంగా చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. కావున ప్రజలు గతంలో ఏ డీలర్ వద్ద మీరు సరుకులు తీసుకుంటున్నారో ఆ డీలర్ వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకోవాలని ఎమ్మార్వో చెప్పారు.

వెన్నుపోటు దినోత్సవం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - చాగలమర్రి: ఈ నెల 4న ఆళ్లగడ్డలో కూటమి ప్రభుత్వం వైఫల్యాన్ని ఎండగడుతూ చేపట్టనున్న వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆళ్ళగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు పిలుపునిచ్చారు. చాగలమర్రి పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది పాలనలో ఓటువేసిన ప్రజలకు చంద్రబాబు ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని, ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. చంద్రబాబు మోసాలను ఎండగడుతూ జూన్ 4న వెన్నుపోటు దినం పేరుతో నిరసనలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. దీనిపై పోస్టర్ విడుదల చేశారు. నియోజవకర్గాల్లో అన్నిస్థాయి అధికారులకూ వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నిరసనలతో చంద్రబాబు కళ్లు తెరిపిస్తామని వివరించారు. మండలం నుంచి సుమారు 400 మోటర్‌సైకిళ్ళో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, వైసీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి బాబులాల్, వైసీపీ నాయకులు గణేష్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, వెంకటరమణచక్రంబీడీ షబ్బీర్, లక్ష్మిరెడ్డి, శేషురమేష్, గేట్లమాబు, షబ్బీర్, ఇబ్రహీం, చాంద్‌బాష, మల్లారెడ్డి, హనుమంతరెడ్డి, సర్పంచ్‌లు గోవిందయ్య, బాలీశ్వరరెడ్డి, బంగారు షరీఫ్, తబ్బిబ్బుబాబు, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీడీవో సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : ఆళ్లగడ్డ ఎంపీడీవో మహబూబ్ ఖాన్ సేవలు చిరస్మరణీయమని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు గజ్జల రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహబూబ్ ఖాన్ పదవి విరమణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ గజల రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఎంపీడీవో గా ఆయన ప్రజలకు చక్కని సేవలు అందించారన్నారు. గ్రామాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అందరితో కలుపుకోరిగా ఉంటూ గ్రామాలలో అభివృద్ధి పనులు చేయించడం జరిగిందన్నారు. ఆయన శేష జీవితం ఆనందంగా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా నన్నారు. పదవి విరమణ పొందిన ఎంపీడీవో మహబూబ్ ఖాన్ మాట్లాడుతూ సర్వీస్ కమిషన్ ద్వారా తాను పంచాయతీరాజ్ శాఖ లోకి ఉద్యోగిగా రావడం జరిగిందని టైపిస్టుగా, జూనియర్ అసిస్టెంట్‌గా, ఈవోఆర్డీగా, ఎంపీడీవోగా వివిధ హెూదాల్లో పనిచేయడం జరిగిందన్నారు. విధి నిర్వహణ చక్కటి సంతృప్తి ఇచ్చిందన్నారు. అందరి సహకారంతోనే తాను ఎంపీడీవో గా మంచి సేవలు అందించడం జరిగిందన్నారు. అనంతరం ఆయనను ఎంపీపీ గజ్జల రాఘవేంద్ర రెడ్డి తోపాటు ఎంఈఓ శోభ వివేకావతి, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఎన్ఆర్జిఎస్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఎంపీడీవో దంపతులను సన్మానించారు. మహానంది ఎంపీడీవో మహబూబ్ దౌలా, నంద్యాల డ్వామా ఏవో హనీఫ్ ఖాన్, ఇంచార్జ్ ఈఓఆర్డి అశ్విని కుమార్, ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయ ఏవో వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రైతులు శాస్త్రీయ సలహాలు పాటించాలి

విశాలాంధ్ర - ఆత్మకూరు టౌన్ : రైతులు శాస్త్రీయ సలహాలు పాటించాలని భారత వ్యవసాయ పరిశోధన మండలి శాస్త్రవేత్త డాక్టర్ వెంకటేశ్వర్లు, కె.వి.కె శాస్త్రవేత్తలు సుధాకర్ సూచించారు. మండలంలోని నల్ల కాలువ, వడ్ల రామాపురం, సిద్ధపల్లె గ్రామాలలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారత వ్యవసాయ పరిశోధన మండలి సంయుక్త ఆధ్వర్యంలో కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి పల్లె ద్వారా వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు శాస్త్రీయ సలహాలు పాటించి పెట్టుబడి ఖర్చు తగ్గించుకొని వ్యవసాయం లాభసాటిగా మార్చుకోవాలని సూచించారు. మొక్కజొన్న, కంది, వరి, మినుము పంటలలో సస్యరక్షణ చర్యలు విత్తన శుద్ధి, తెగుళ్లు, పురుగుమందుల యాజమాన్యం పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సహాయకులు ఆత్మకూరు బి.ఆంజనేయ, మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, డిఆర్సి ఏఓ హేమలత, సహాయ పట్టు పరిశ్రమ సహాయకులు నాగేంద్ర, డిఆర్సి బీటీఎం ఉమామహేశ్వరి, నల్ల కాలువ గ్రామ సర్పంచ్ వెంకటరమణ, కౌలు రైతు సంఘం అధ్యక్షులు ఆసిఫ్ అలీ, ఏఈఓ లతమ్మ, రైతు సేవా కేంద్ర సిబ్బంది, రైతుల పాల్గొన్నారు.

మహానాడు పయనం సుఖమయం

విశాలాంధ్ర - రుద్రవరం: మహానాడు పయనం ఎంతో సుఖమయంగా సాగిందని కె.కొత్తూరు గ్రామానికి చెందిన మునగాల జగదీశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మొన్న జరిగిన మహానాడు కార్యక్రమానికి మండల పరిధిలోని కొత్తూరు గ్రామం నుండి తరలి వెళ్లిన టీడీపీ నాయకులు కార్యకర్తలు మహానాడుకు వెళ్లి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తిరుగు ప్రయాణం సుఖంగా సాగిందన్నారు. మహానాడుకు వెళ్ళిన వారిలో విశ్వనాథరెడ్డి, గుర్రప్ప, రవి, శివ, నాగేంద్ర, సుగాలి చంద్రశేనుడు, పాశం గుర్రప్ప, పుల్లయ్య, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారన్నారు.

ఎంపీడీవో, సచివాలయ సిబ్బందికి యోగా శిక్షణ

విశాలాంధ్ర - పాములపాడు : యోగా శిక్షణలో భాగంగా శనివారం మండల కేంద్రంలో పాములపాడు లోని మోడల్ స్కూల్ నందు ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంపీడీవో సిబ్బంది అయిన విఆర్ఓ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది కి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ యోగా అనేది పూర్వకాలం నుండి నేటి వరకు కొనసాగుతుందనిచ ఈ యోగా వలన మనసు ప్రశాంతత రోగనిరోధక శక్తి మానసిక ఉల్లాసం శారీరక దారిద్యం గడమే కాకుండా మనిషి ఒత్తిడి నుండి ప్రశాంతతను పొందవచ్చునని ప్రతి ఒక్కరు యోగాను నేర్చుకుని పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పవనీశ్వర్ రెడ్డి, విఆర్వోలు కలిగిముళ్ళ, శివన్న, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగాపై శిక్షణ

విశాలాంధ్ర - చాగలమర్రి: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం టిఓటిలకు మాస్టర్ ట్రైనర్స్ పంచాయతిరాజ్ ఏఈ కొండా రెడ్డి, తేజస్వినీ, విష్ణుప్రియలు శిక్షణ ఇచ్చారు. టిఓటిలో శిక్షణ పొందిన వారు గ్రామ సచివాలయ పరిధిలో యోగాంధ్రకు ఎంపికైన వారికి శిక్షణ ఇస్తారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పకుండా వారి రోజువారి జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవడం వల్ల ఆరోగ్యం సిద్ధిస్తుందని, మానసిక ప్రసంత లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎంసీఓ రాజ్‌కుమార్, సచివాలయాల, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - శిరివెళ్ల : సమాజంలోని ప్రతి పౌరునికి పౌర హక్కులపై అవగాహన అవసరమని తహశీల్దార్ పుష్పకుమారి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ రాజ్యాంగంలో కల్పించిన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండి వాటికి అనుగుణంగా స్వేచ్ఛ స్వాతంత్రాన్ని అనుభవిస్తూ అభివృద్ధి సాధించాలని అన్నారు.హక్కులను కాపాడుకుంటూ చట్టాన్ని దుర్వినియోగం చేయకుండా అంటరానితనం పాటించడం సాటి మనిషి పట్ల వివక్ష చూపడం అవమానపరచడం చట్టరీత్యా నేరమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సి శివమల్లేశ్వరప్ప, ఆర్ ఐ రాఘవేంద్ర కుమార్, పోలీస్ సిబ్బంది, విఆర్ఓ భాస్కర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి యామా గుర్రప్ప, సర్పంచ్ లక్కాకుల సాలమ్మ చంద్ర, గిత్తల రాజ్ తదితరులు పాల్గొన్నారు.